www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 జనవరి 2023

చెట్టును ఢీకొట్టిన కారు : ఇద్దరి దుర్మరణం

ప్రజాశక్తి–సామర్లకోట రూరల్

వేగంగా వచ్చి షిఫ్ట్ డిజైర్ కారు చెట్టును బలంగా ఢీకొట్టిన సంఘటనలో కాకినాడకు చెందిన ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం సామర్లకోట నుండి కాకినాడవైపు వస్తున్న కారు మాధవపట్నం చైతన్య ఇంజనీరింగ్ కాలేజ్ వద్దకు వచ్చేసరికి వేగంగా వచ్చి రోడ్డు పక్కన వున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. దాంతో కారులో పంజాది సతీష్ (24) మృతిచెందగా, చికిత్స కోసం 108లో తరలిస్తుండగా హరీష్ అనే మరో వ్యక్తి మృతిచెందారు. కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. కాకినాడ పాత బస్టాండ్ సమీపంలోని గ్రెజరిపేటకు చెందిన సతీష్‌కు ఇటీవలే వివాహం అయినట్లు సమాచారం. మరో మృతుడు వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఇంద్రపాలెం ఎస్ఐ కె. నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలి

-యుటిఎఫ్ మహిళా సదస్సు డిమాండ్

-సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - కాకినాడ

బాలికలకు విద్యను దూరం చేసే నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక యుటిఎఫ్ టీచర్స్ హోంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి సభ నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉద్యమాలు – సమాజమార్పు – శ్రామిక మహిళల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సభకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె. సుబ్బరావమ్మ ముఖ్యవక్తగా ప్రసంగించారు. సమాజ మార్పులో మహిళా ఉద్యమాల పాత్ర చాలా కీలకంగా ఉందని, తరతరాలుగా స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు అమానుష చర్యలు ఇకనైనా ఆగాలన్నారు. సంఘ సంస్కరణ ఉద్యమాలు మహిళలను చైతన్య పరిచాయని, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కూడా శ్రామిక మహిళల సమస్యలను ఎజెండా లోకి తెచ్చింద న్నారు. మహిళలకు ఈమాత్రమైనా సౌకర్యాలు వచ్చాయంటే వాటి వెనుక సావిత్రిబాయి వంటి ఎందరో త్యాగం ఉందన్నారు. కేంద్ర పాలకులు బేటీ బచావో బేటీ డావో అని నినాదాలిస్తూ ఆచరణలో బాలికలకు చదువు దూరం చేస్తున్నారని విమర్శించారు. బిల్కిస్ బానో పై అత్యాచారం చేసిన దుండగులు మోడీ దృష్టిలో సచ్ఛీలురుగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 1998 నుండి మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో మూలుగుతుందన్నారు. దిశ చట్టం, నిర్భయ చట్టం వంటివి ఎన్ని వచ్చినా మహిళ లపై అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. భారత సమాజంలో నేటికీ 94 శాతం మహిళలు సరైన సౌకర్యాలు అందుకోలేక పోతున్నారన్నారు. మరింతగా మహిళలు ఉద్యమాల్లోకి రావాలన్నారు.

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబి రాణి, బి నాగమణి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కేవీవి నగేష్, జిల్లా జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఐ ప్రసాద రావు, జిల్లా కార్యదర్శి డికెడి దేవి, రెహమాన్ బీ, రాజేశ్వరి, సిహెచ్. వేణు తదితరులు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవితం, కృషిని, త్యాగాలను కొనియాడారు. ఈ సందర్భంగా గీతాంజలి బందం ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో సూర్యావతి, బేబి, కెవి లక్ష్మి, ఎం. వర లక్ష్మి, ఉషా, గంగా భవాని, దుర్గారాణి, తేజలతో పాటు యుటిఎఫ్ నాయకులు పివిఎన్ గణేష్, వజ్రపు మహేష్, పెద్దిరాజు, సూరిబాబు, నూకరాజు, జయప్రకాష్, సిహెచ్.వి. రమణ, రవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జండా ఊపి మారథాన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఉల్లాసంగా సీ పోర్ట్స్ మారథాన్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సీ పోర్టు మారథాన్ 5వ ఎడిషన్ రన్ ఆదివారం కాకినాడ న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో కార్యక్రమాన్ని కలెక్టర్ కృతికా శుక్లా జండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమంలో కాకినాడ సీ పోర్ట్స్ మురళీధర్, రిలయన్స్ సైట్ ప్రెసిడెంట్ అక్షయ జిక్క, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వై.డి. రామారావు, పవర్ ఎలక్ట్రికల్ సాయి సమీర్ రెడ్డి, ఓఎన్జీసీ అధికారులు, దేవి సీ ఫుడ్స్ అధికారులు, జీఆర్టీ గ్రాండ్ హోటల్ అధికారులు, ఆటార్స్ మోటార్ స్పోర్ట్స్ అధికారులు ప్రసంగించి కార్యక్రమంలో పాల్గొన్న రన్నర్స్‌ను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య వంతంగా ఉండేందుకు అవసరమైన రోగనిరోధక శక్తి యొక్క ప్రాధాన్యత, దానిని పెంపొందించుకునే పద్ధతులను గురించి మాట్లాడి నిత్య జీవితంలో పరుగు అవసరాన్ని నొక్కి చెపుతూ మారథాన్ కార్యక్రమంలో పాల్గొనే వారినందరినీ ఉత్తేజపరిచారు. కార్యక్రమ నిర్వాహకులను, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన అధికారులకూ, స్పాన్సర్లకు, పాల్గొన్నవారందరికి కలెక్టర్ శుక్లా అభినందనలు తెలియజేశారు. ప్రజలం దరూ ఆరోగ్యకరమైన జీవన పంథాను అలవరచుకుని కొద్దిపాటి సమయాన్ని అయినా వ్యాయామ కార్యక్రమాలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమం హాఫ్ మారథాన్ (21.2 కిమీ), 10 కిమీ, 5కిమీ, 3కిమీ కాటగరీలలో నిర్వహించినట్లు కార్యక్రమ నిర్వాహకులు సుధా కేశవరాజు, ఎన్.ఎల్. శ్రీనివాస్, సుభాష్ కొప్పన తెలియజేశారు. ప్రత్యేకించి ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని విధాలుగా కషి చేసిన పోలీసు సిబ్బందికి, ప్రభుత్వ అధికారులకూ, స్పాన్సర్లకూ వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 పరీక్ష

- పరీక్షకు 69 శాతం మంది హాజరు
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సి) గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,782 మంది అభ్యర్థులకు గండేపల్లి మండలం, సూరంపాలెంలోని ఆదిత్య విద్యా సంస్థల ప్రాంగణంలో ఏడు కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయగా 69 శాతం మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన నోడల్, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆదిత్యలో.....

గండేపల్లి మండలం ఆదిత్య విద్యా ప్రాంగణంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెద్దాపురం ఇంచార్జ్ డి.ఎస్.పి మురళి మోహన్ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, గండేపల్లి, జగ్గంపేట ఎస్.ఐ ల పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు పరీక్షా కేంద్రాలు పరిశీలించి ఏర్పాట్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వికలాంగులు, గర్భిణులు వికలాంగులు వాహనాలలో పరీక్ష కేంద్రాలకు తీసుకువెళ్లే విధంగా ఆదిత్య యాజమాన్యం బ్యాటరీ వెహికల్ లను సిద్ధం చేసి వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకునానరు. మొత్తం క్యాంపస్‌లో 7 కేంద్రాలలో 4782 మంది పరీక్షకు హాజరు కావాల్సిఉండగా 3321 మంది హాజరు అయ్యారు. 1461 మంది హాజరు కాలేదు.

రంగరాయ ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న మంత్రి అప్పలరాజు, పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనంలో స్నేహితులతో కలిసి ఫోటో సెషన్ లో పాల్గొన్న మంత్రి సీదిరి అప్పలరాజు

'రంగరాయ' 1997 బ్యాచ్ ఆత్మీయ కలయిక

- స్నేహితులతో కలసి గత స్మృతులతో సందడి చేసిన మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - కాకినాడ

గత మూడు రోజులుగా స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో 1997 బ్యాచ్ కు చెందిన వైద్య విద్యార్థులు చేపట్టిన ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రంగరాయ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాత జ్ఞాపకాలతో స్నేహితులతో కలిసి సందడి చేశారు.

రంగరాయ వైద్య కళాశాలలో చదువుకుని 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎంబిబిఎస్ 1997 బ్యాచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో సుమారు వంద మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయినట్టు నిర్వహకులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ త్రిమూర్తులు రాయుడు తెలిపారు. 7వ తేది సాయంత్రం నుండి స్నేహితులతో కలిసి ఆటా పాటలతో మంత్రి అప్పలరాజు ఉల్లాసాన్ని రేకెత్తించారు. అనంతరం తన స్నేహితుడైన డాక్టర్ ఆదిత్య తండ్రి డాక్టర్ ఏ.వి రెడ్డి నాయుడు జ్ఞాపకార్థం అనాటమీ తరగతి గదిలో ఏర్పాటు చేసిన డిజిటల్ బ్లాక్ బోర్డును మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. అనంతరం కాలేజీ ప్రాంగణంలో తోటి స్నేహితులతో ఫోటో సెషన్ రంగరాయ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వైబ్రేంట్ కల్చర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.వి.ఎల్. నరసింహంను పూర్వ విద్యార్థులతో కలిసి మంత్రి సన్మానించారు. ఆనందమే కాదు విషాద సంఘటనలు వారి మధ్య కన్నీటి తడిని కలిగించాయి. దీనికి కారణం ఇటీవలే అనారోగ్యం కారణంగా కీర్తి శేషులైన తోటి స్నేహితులు డాక్టర్ శ్రీనివాస్ విర్రాజు, డాక్టర్ కిషోర్ కుమార్‌ల జ్ఞాపకాలు విషాదాన్ని కలిగించాయి. వారి మృతికి సంతాపం తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

లారీల అడ్డగింత

రోడ్డుపై నిలిచిపోయిన లారీలు

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని మల్లంపేట గ్రామం మీదగా రవాణా సాగుతున్న క్వారీ లారీలను గ్రామస్తులు ఆదివారం అడ్డగించారు. లారీల రవాణాతో దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు భారీ లోడుతో అతివేగతంతో లారీలు ప్రయాణించడంతో భయాందోళనకు గురి అవుతున్నామని తెలిపారు రహదారిని ప్రతిరోజు నీటితో తడపడం తో పాటు తక్కువ లోడుతో లారీలు రవాణా చేపట్టాలని డిమాండ్ చేశారు.

రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయనకుటుంబ సభ్యులు

ఘనంగా కోటయ్య స్వీట్స్ అధినేత రామకృష్ణ జయంతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఘనంగా కోటయ్య స్వీట్స్ అధినేత చిట్టి పెద్ది రామకృష్ణ 68వ జయంతి కార్యక్రమాన్ని ఆయన కుమారులు రామ్‌కుమార్, లక్ష్మణ్ కుమారులు ఘనంగా నిర్వహించి, పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా పెద్ద కుమారుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కోటయ్య కాజాకు ఎనలేని ప్రతిష్టలు తెచ్చి కాకినాడకు కీర్తిని ఆపాదించిన మహోన్నత వ్యక్తి తమ తాతయ్య కోటయ్య నుండి నేర్చుకున్న సేవా భావంతో తమ తండ్రి రామకష్ణ చాలా సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని ఆయన అభీష్టం మేరకే ఆయన జయంతి వేడుకలు ప్రతీ యేటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాకినాడ సిటీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులతో పాటు స్థానిక పేద ప్రజలకు బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు చేశారు. 100 మంది విశ్రాంతి ఉద్యోగులకు యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (లైఫ్ సర్టిఫికెట్లు) అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష , కార్యదర్శులు కెవివి. రామకృష్ణ, ఏ.వి.వీ.సత్యనారాయణ, కోశాధికారి దడాల వెంకన్న, కడలి ప్రకాశరావు, పి.వి. హనుమంతరావు, దడాల మంగాదేవి, సిటీ మల్టీస్పెషల్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సిహెచ్. చినబాబు, టెక్నికల్ టీం హరికిరణ్, విజయ్, సంతోష్, వెంకట్ పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన మిలాన్

అలరిస్తున్న జబర్దస్త్ ఆది పార్టీ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఆదిత్య సిబ్బంది కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం మిలాన్ పేరిట నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమం ఎంతో ఉత్సాహ పూరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఆదిత్య క్యాంపస్ ఇంజనీరింగ్ ఫార్మసీ పాలిటెక్నిక్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలలకు చెందిన టీచింగ్ టెక్నికల్ నాన్ టీచింగ్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఆదిత్య యాజమాన్యం మిలాన్ పేరిట ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్యలో గత 15 సంవత్సరాలు, అంతకు పైబడి సేవలం దిస్తున్న వివిధ విభాగాల సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సిబ్బంది వారి కుటుంబ సంయుల ఆటపాటలతో డాన్స్ ప్రోగ్రామ్‌లతో ఆద్యంతం ఎంతో ఆనందం భరితంగా నిర్వహించారు. గత 23 సంవత్సరాలు గా క్యాంపస్ దినదినాభివద్ధి గాంచిన విధానాన్ని వివరిస్తూ ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఫోటో ప్రదర్శనలో పాల్గొన్న ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అప్పటి పరిస్థితులు గుర్తుచేసుకొని నాటి సంగతులను చెప్పిన విధానం ఎంతో సంభ్రమాశ్చర్యాలు కలుగజేసింది.

ఈ సందర్భంగా జబర్దస్త్ టీమ్ సభ్యులు హైపర్ ఆది,గెటప్ శ్రీను, ఆటో రాంప్రసాద్,దొరబాబు లచే ప్రదర్శించిన స్కిట్‌లు ఆహుతులను అలరించాయి. చిన్నారుల నత్య ప్రదర్శనలు, ఎంతో ఉత్సాహాన్ని కలిగించాయి. ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, శతి రెడ్డి దంపతుల ద్వితీయ కుమార్తె "చి. భవ్యసహజారెడ్డి" ముచ్చటగొలిపే విధంగా ప్రదర్శించిన నత్య ప్రదర్శన కన్నుల పండుగలా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జె.ఎన్.టి.యు.కె కాకినాడ వైస్ ఛాన్సలర్ ప్రసాదరాజు, ప్రొ. డా. సిహెచ్ మురళీకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేసిన శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విజయ పరంపరలో సిబ్బంది సహకారం ఎంతో ఉందని వారికి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు అందజేశారు. సతీష్ రెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సైతం తమ సిబ్బంది ఎంతో సహకారం అందించి సంస్థ మనుగడకు తోడ్పాటు అందించారని వారి సహకారం వల్లే అత్యధిక శాతం ప్లేసెమెంట్ లు సాధించగలుగుతున్నామని, 90 శాతానికి పైబడి అడ్మిషన్లు పొందగలుగుతున్నామని అన్నారు. ముఖ్య అతిథులు డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థలు ఏ కార్యక్రమం అయినా వినూత్నంగా భారీగా చేయడం పరిపాటి అని ఇటువంటి కార్యక్రమం సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని భాద్యతను పెంచుతుందని అన్నారు. డాక్టర్ మురళీకష్ణ మాట్లాడుతూ క్రమశిక్షణకు అత్యుతమ విలువలతో కూడిన విద్యను అందించే సంస్థ ఆదిత్య రాష్ట్రస్థాయిలో పేరు పోందిందింది అని శేషారెడ్డి గారి కషి వారి తనయులు సతీష్ రెడ్డి గారు దానిని కొనసాగించే విధానం అంతకు మించి నూతన ఆలోచనలతో సంస్థ అభివృద్ధికి సిబ్బంది ని సొంత కుటుంబంలా చూసుకునే విధానం అద్భుతం అని ఈ సంస్థ మరింత అభివృద్ధి పథంలో సాగాలని కోరారు. అనంతరం పసందైన విందుతో కార్యక్రమాలు ముగిసాయి. కార్యక్రమంలో ఆదిత్య యాజమాన్యం కుటుంబ సభ్యులు నల్లమిల్లి లక్ష్మీరాజ్యం, శృతి రెడ్డి, డాకటర్ సుగునారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి,డా. ఎ.రమేష్, డోలా సంజయ్, కే.రవిశంకర్, డి.సతీష్ కుమార్, ఎస్.టి.ఎస్.వి.కుమార్, సంజయ్, వివిధ విభాగాల డీన్ లు, విభాగాధిపతులు,ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాలను ప్రొఫెసర్ టి.నీలిమ తన యాంకరింగ్‌తో అద్భుతంగా నడిపించి ప్రశంసలు అందుకున్నారు.

సీనియర్ ఉద్యోగులను సత్కరిస్తున్న ఆదిత్య శేషారెడ్డి, సతీష్‌రెడ్డి

ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు

క్రీడాపోటీల్లో విజేతలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్ పాలిటెక్నిక్ ఆటలు, క్రీడల పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా సాంకేతిక విద్య ఆర్‌జెడి జె.సత్యనారాయణ మాట్లాడారు. మూడు జిల్లాల్లోని 27 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ క్రీడల్లో బాలుర విభాగంలో ఏపీటీ, బాలికల విభాగంలో జీపీటీలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చెస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో విజేతలు ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జీపీటీ ప్రిన్సిపల్, సమన్వయకర్త టి.వి.రాజశేఖర్ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్యనారాయణకు స్వర్ణం

ప్రజాశక్తి- పెద్దాపురం

బంగారు పతకం అందుకుంటున్న సత్యనారాయణ

విశాఖపట్నంలో జరిగిన ఇండియన్ నేషనల్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ ఛాంపియన్షిప్ 2022 – 23లో పవర్ లిఫ్టింగ్ జూనియర్ విభాగంలో పెద్దాపురం పట్టణానికి చెందిన గొర్రెల సత్యనారాయణ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. అలాగే పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ విభాగంలో సామర్లకోట పట్టణానికి చెందిన డి.రాజేష్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఇద్దరు క్రీడాకారులను ఆదివారం మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు పెదిరెడ్డి నరేష్, వంగలపూడి శివకష్ణ, నవీన్ నాని, సత్య ప్రశాంత్, లక్ష్మణ్ దివాకర్, నెల్లూరి హర్ష అభినందించారు.

ఎపిఒ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎపిఒ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి గొల్లపల్లి బుజ్జి ఇన్‌సెట్‌లో ఎపిఒ మధుసూదనరావు ఫైల్

ఎన్ఆర్ఈజీఎస్ ఏలేశ్వరం ఎపిఒ అయితె మధుసూదనరావు ఆదివారం గుండుపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. పిఠాపురానికి చెందిన మధుసూదన రావు నాలుగేళ్లుగా ఏలేశ్వరంలో విధులు నిర్వహిస్తూ పలువురు ప్రశంసలు పొందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఒక కుమార్తె వికలాంగు రాలు. ఆయన మృతి వార్త తెలిసిన ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పిఠాపురం చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతికి ప్రజా ప్రతినిధులు, ఏపీడి, వివిధ శాఖల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

కార్టూ'నిజం'

యధేచ్ఛగా అధికార పార్టీ నేతల ర్యాలీలు, సభలు.. ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలో భారీ ర్యాలీలు

ఘనంగా 'శ్రీ ప్రకాష్' అధినేత నరసింహారావు పుట్టినరోజు

ప్రజాశక్తి - గండేపల్లి

నిత్య కృషీవలుడు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత చిట్టూరి వెంకటకృష్ణ నరసింహారావు 80 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా ఆయన ఆత్మీయ మిత్రులు, శ్రేయోభిలాషులు కలసి గండేపల్లిలో డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు కృషివనంలో ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించి ఘనంగా సత్కరించారు.

కార్యక్రంలో నాబార్డు చైర్మన్ (రిటైర్డ్) డాక్టర్ పమిడి కోటయ్య, ముల్కనూర్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, దాన పండిట్, ఉత్తమ రైతు నెక్కంటి సుబ్బారావు సిబిఆర్ అకాడమీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ చైర్మన్ చలసాని బాబు రాజేంద్రప్రసాద్, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ (రిటైర్డ్)

నరసింహారావును సత్కరిస్తున్న మిత్రులు, అభిమానులు

పాలాది మోహనయ్య, వ్యవస్థాపక డైరెక్టర్, సీఈఓ, ఐఎన్ఏవి పవర్ – మల్లెల వెంకటరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ మన్మోహన్ సింగ్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ 1977లో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలను తునిలో స్థాపించి, దిగ్విజయంగా ఆంధ్రరాష్ట్రం లోని వివిధ జిల్లాల్లో శాఖలు విస్తరించి నిర్వహిస్తున్నారని, పాడిరైతుగా 2014వ సంవత్సరం లో జాతీయ స్థాయి ఉత్తమ పాడి రైతు అవార్డు సాధించడమే కాకుండా పశువుల ద్వారా వచ్చే వ్యర్థాల నుండి రాష్ట్రంలోనే అతిపెద్ద బయోగ్యాస్ ప్లాంట్ స్థాపించి, నిర్వహిస్తూ తమ విద్యా సంస్థలకు కావలసిన గ్యాస్, విద్యుత్‌ను తయారుచేయడమే కాకుండా త్వరలో వాహనాలు కూడా ఈ గ్యాస్‌తో నడిచే దిశగా ప్రయోగాలు చేస్తున్నారన్నారు. కేరళలో లక్షల రూపా యలు వెచ్చిస్తే గాని లభించని ఆయుర్వేద చికిత్సను పాయకరావుపేటలో శ్రీ ప్రకాష్ ఆయుర్వేద చికిత్సాలయం స్థాపించి అతి తక్కువ ఖర్చుతో రోగులకు అనుకూలంగా మెరుగైన ప్రమాణాలతో వైద్యసేవలు అందిస్తున్నారని, తన స్నేహితుల జ్ఞాపకార్థం తాగునీటి వసతి లేని కొన్ని గ్రామాలకు ఆర్ఓ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి తన సేవలను చాటుకున్న మహామనిషి అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా చిట్టూరి వెంకట కృష్ణ నరసింహారావు జీవన చిత్రం 'వేయి పున్నములు – కోటి దీపాలు పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమం పాల్గొన్న అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, నరసింహారావు చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

వైసిపి విధానాలతో ప్రజలు విసిగిపోయారు

ప్రజాశక్తి–సామర్లకోట రూరల్

వైసీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, ఎన్నికలు వస్తే ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం సాయంత్రం సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంను నిర్వహించారు. ఎంఎల్ఎ రాజప్ప ఇంటింటికి వెళ్ళి వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వైఖరిని కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు తోటకూర శ్రీనివాసు, పనసపాడు గ్రామ సర్పంచి చీకట్ల వెంకటేష్, గొంచాల టీడీపీ నాయకులు ముమ్మిడి సూరిబాబు, పోతుల శ్రీను, తోట నాగబాబు, కామరాజు, వెన్నా దివానం, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న ఎంఎల్ఎ సతీష్ కుమార్

బీమాబాయి మహిళా మండలి సేవలు భేష్..

ప్రజాశక్తి -తాళ్లరేవు

తాళ్ళరేవు బీమా భాయ్ మహిళా మం డలి చేస్తున్న సేవ లను ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కొని యాడారు. భీమాబాయి మహిళా మండలి సంఘ భవనంలో ఆదివారం సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను వికలాంగులకు, వితంతువులకు ఎంఎల్ఎ పొన్నాడ అందజేశారు. మండలానికి చెందిన ఐదు గ్రామాలలోని బాధితులకు నిత్యవస రాలైన బియ్యం, కిరాణా సరుకులు, పౌష్టికాహారం కిట్లను 450 మందికి అంద జేసినట్లు బీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కుడిపూడి శివన్నారాయణ, రాయుడు గంగాధర్, ఎంపీటీసీ నందికోళ్ల శ్రీదేవి, సచివాలయ

10 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

సంక్రాంతి సందర్భంగా పి.మల్లవరంలో ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మల్ల వరం పెదపేట క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లను ఎంపీపీ రాయుడు సునీతతో కలిసి నిర్వాహకులు పరిశీలించారు. అనంతరం కుడుపూడి శివన్నారాయణ మాట్లా డారు. ఈనెల 10వ తేదీన కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు పోటీలను ప్రారంభిస్తారన్నారు. మంత్రులు, వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు, కార్యక్ర మంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయుడు సునీత, వైకాపా మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, మట్టపర్తి లోవరాజు, యడ్ల కుటుంబరావు, సోనూ, ఫిసింగి సతీష్, శివ, శీలం బాలకృష్ణ, చంటి, దడల ఈశ్వర రావు, శ్రీను నల్లి శ్రీను రామకష్ణ, కామాడి బైరవ మూర్తి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రమాణ స్వీకారం చేసిన వాసవి నూతన కార్యవర్గం

గండేపల్లిలో ఆదివారం వాసవి క్లబ్ గండేపల్లి, వీకేఎస్పీ క్లబ్ గండేపల్లి, మల్లేపల్లి వాసవి క్లబ్ 2023వ సంవత్సరంకు సంబంధించి ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ గండేపల్లికి నూతన అధ్యక్షు డిగా వాసవియన్ సత్యవరపు దుర్గా ప్రసాద్, కార్యదర్శిగా మాతంశెట్టి రాము, కోశాధికారిగా కటకం అంజిబాబు, వీకేఎస్పీ క్లబ్‌కి నూతన అధ్యక్షుడిగా వాసవియన్ కెసిజిఎఫ్ కొత్త లక్ష్మీ నారాయణ వీర గుప్తా, కార్యదర్శిగా వాకచర్ల వేణు గోపాలకష్ణ, కోశాధికారిగా కటకం రామకష్ణ, మల్లేపల్లి వాసవి క్లబ్ ప్రెసిడెంట్‌గా వరదా శ్రీనివాస్ అండ్ టీమ్, జోన్ చైర్మన్‌గా మాతంశెట్టి వీర వెంకట సురేష్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా వాకచర్ల నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌గా మండవల్లి సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వీ210ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్, టీం రీజనల్ చైర్మన్, చీఫ్ గెస్ట్ కుసుమంచి పాపారావు ఆర్యవైశ్య సంఘం ప్రముఖుల సభ్యులు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంటలు వేసి, చిన్నారులకు భోగి పళ్ళ పోసి, పిల్లలకు పతంగాల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థులు ఇద్దరికి రూ. 7500 విద్యా ఖర్చులు నిమిత్తం అందజేశారు.

నేటి నుంచి శ్రీ ప్రకాష్‌లో జాతీయ స్థాయి టిటి పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

రామారావు పేటలోని శ్రీప్రకాష్ చినర్జీ స్కూల్లో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు ఐదు రోజులపాటు జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు జరుగు తాయని స్కూల్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 24 క్లస్టర్ల లో జరిగిన పోటీలలో విజయం సాధించిన సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటార న్నారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ప్రెసిడెంట్ వి.భాస్కర రావు, ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాలశాఖ మంత్రి, శ్రీ ప్రకాష్ విద్యా నికేతన పూర్వ విద్యార్థి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీతా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ప్రముఖ పేలాంత్రోపిస్టు, స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ చైర్మన్ సిబిఆర్ ప్రసాద్‌లు పాల్గొంటారన్నారు. ఈపోటీలకు సంబంధించి చీఫ్ రెఫరీ పివిఎస్ సూర్యారావు, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ పి.వేణుగోపాల రావు, డిఎస్ కుమార్, సికె భగవాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని శంగవరంలో కాకినాడ జిల్లా యాదవ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మసుమేను గంగయ్య యాదవ్ సమకూర్చిన దుస్తులను ఆదివారం యాదవ్ సామాజిక వర్గానికి చెందిన వారికి చీరలు. దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో బద్ది రామారావు. లోండ దేవుళ్ళు అల్లు నూకరాజు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మంత్రి వేణు

హత్యకు గురైన విద్యార్థినికి రూ .10 లక్షల సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

డిగ్రీ చదువుతూ హత్యకు గురైన కె.గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన కాదా శ్రీదేవి కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకష్ణ రామచంద్రపురంలో మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. మృతురాలి తల్లి కాదా నాగమణి, రాంబాబు దంపతులకు ఈచెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పంపన సుబ్బారావు కోటి వెంకటరావు తదితరులు హాజరయ్యారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి -అమలాపురం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అమలాపురం కిమ్స్ కళాశాల గ్రౌండ్లో అనురాధ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ విన్నర్స్ కి బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, జెడ్పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులతో కలిసి విజేతలను అభినందించి నగదు బహుమతులను ట్రోఫీలను ఎంపీ చింతా అనురాధ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో దశ్య కలల అకాడమీ చైర్మన్ శ్రీమతి కుడుపూడి సత్యశైలజ , హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాలముని కుమారి, జెడ్పిటిసి సభ్యులు కొనుకు గౌతమి, గెడ్డం సంపత్ రావు , పందిరి హరి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఒఎన్‌జిసి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి -రావులపాలెం

సాయం అందజేస్తున్న ఎమ్ఎల్ఎ జగ్గిరెడ్డి

రావులపాలెం చిర్ల సోమసుందర రెడ్డి నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగాను, పాక్షికంగాను ఇళ్ళు కాలిపోయి నిరాశ్రయులైన మానుపాటి సతీష్, బందరి శ్రీను తదితర కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్ఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం పరామర్శించారు. వారికి రూ.21 వేలు నగదు సహాయంతో పాటు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం నుంచి అందవలసిన అన్ని సహాయ సహకారాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి, జెడ్పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో మార్కొండపాడుకు చెందిన షేక్ కరీముల్లా(35) అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ తెలిపారు. తన తండ్రి షేక్ కరీముల్లా రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన ఇంత వరూ తిరిగి రాలేదని షేక్ సబీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. దర్యాప్తు చేపట్టామన్నారు.

జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు

ప్రజాశక్తితో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కోరుకొండ, గోకవరం మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో దాదాపుగా సాగు ప్రారంభమైంది. రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. ఈ దశలో నీటి వనరులు, ఎరువుల లభ్యత తదితర విషయాలపై రైతుల్లో కలవరం మొదలైంది. మరో వైపు యూరియా కొరత నెలకొందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని సాగు సంబంధింత విషయాలు, ఎరువుల లభ్యతపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాల్లో మాటల్లోనే..

జిల్లాలో నాట్లు ఎన్ని ఎకరాల్లో ప్రారంభం అయ్యాయి. రబీ సాగు విస్తీర్ణం ఎంత?

జిల్లాలో రబీ సాగు 2.07 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. దాదాపుగా అన్ని మండలాల్లో సాగు ప్రారంభమైంది. 60వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. గోకవర, కోరుకొండ మండలాల్లో ఖరీఫ్ కోతలు ఆలస్యంగా కావడంతో అక్కడ సాగు కొంత ఆలస్యంగా ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 15 నాటికి 90 శాతం నాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. సాగు ప్రారంభం నేపథ్యంలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచాం.

జిల్లాలో యూరియా, ఎరువుల కొరత వార్తలపై ఏమంటారు?

యూరియా కొరత లేదు. రబీ సాగుకు సంబంధించి రెండు నెలల ముందుగానే కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు కావల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాము. మొత్తం రబీ సాగుకు దశల వారీగా సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుంది. తొలిదశ అవసరాలకు తగ్గట్లుగా 19,140మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంం,. యూరియా 8,300 మెట్రిక్ టన్నులు, డిఎపి 4,200, కాంప్లెక్స్ ఎరువులు 6300, ఎంఒపి 2,500 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

ముందస్తు సాగుతో రైతులకు ఎం ప్రయోజనం లభించింది..?

రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతేడాది ఖరీఫ్‌లో ముందస్తు వ్యవసాయ ప్రణాళికలను రూపొందించడంతో మంచిఫలితాలు వచ్చాయి. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే పరిస్థితుల నుంచి కొంత ఊరట లభించింది. తాజాగా రబీ కూడా నెల రోజులు ముందుగానే ప్రారంభమైంది.

మెట్టలో సాగును ప్రోత్సహించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో 15,265 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటిలో 8,455 బోర్ల ద్వారా ఉద్యాన పంటలకు సాగు నీరు అందిస్తుండగా మిగిలిన 6,810 బోర్లు మెట్ట ప్రాంతం లోనే ఉన్నాయి. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేట, బిక్కవోలు తదితర మండలాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతంలో 1.40 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. వీటిలో గొట్టపు బావుల సాయంతో 50 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. రబీలో ఎక్కువగా ఆర్ఎన్ఆర్ 15048 వరి వంగడాన్ని సాగు చేస్తున్నారు. దీనికి తెగుళ్ల బెడదతక్కువ మంచి దిగుబడిని ఇస్తుంది. ఈ పంట తర్వాత మూడో పంటగా అపరాలు, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట సాగు చేయటానికి ఈ ముందస్తు సాగు ఉపయోగ పడుతుంది.

ప్రతి ఏటా రబీ చివరి దశలో నీటి కొరత తలెత్తుతోంది. దీన్ని అధిగమించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు..?

కలెక్టరు ఆధ్వర్యాన వ్యవసాయ శాఖతో పాటు ఇతర సాగు సంబంధిత శాఖలతో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి నీటి పంపిణీపై చర్చించారు. ఈ ఏడాది సాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 71వేల గోదావరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి సెంటుకూ నీరు అందించే లక్ష్యంతో క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజిన్ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి పెడుతున్నారు. కావున సాగునీటి కొరత ఇబ్బందులుండవు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున మంత్రి వేణుగోపాలకృష్ణ

2024 ఎన్నికలో సిఎం అభ్యర్థిగా పవన్‌ను ప్రకటించగలరా

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ముసుగు తొలగించి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైన, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కలిసి వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ప్రకటించగలరా అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ప్రశ్నించారు. కాకినాడ ఆర్అండ్‌బి అతిథి గృహలను నిర్వహించిన విలేకరుల సమావేశం మాట్లాడారు. ప్రజా స్వామ్యంలో రాజకీయ పార్టీలు వారి లక్షల అనుసరించి ప్రజల్లోకి వెళ్లడం ఆనవాయితీని, కానీ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాన్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని అడ్డుకువడమే లక్ష్యంగా ముందుకుసాగు తున్నారనారు. 2014లో ముఖ్యమంత్రిగా చేసిన తప్పులను పవన్ కళ్యాణ్ ఎందుకు ఎత్తి చూపడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించడానికి పార్టీ పెట్టి, విలువలతో కూడిన రాజకీయం చేస్తానన్న నీవు, 2019 ఎందుకు విడిపోయారో చెప్పాలని మళ్ళీ ఇప్పుడు ఎందుకు కలుస్తున్నారో చెప్పాలన్నారు. అసలు జనసేనకు ఎజెండా అంటూ ఏమైనా ఉందని, 175 స్థానాల్లో పోటీ పెట్టడానికి నాయకులు లేని జనసేన పార్టీ, కేవలం ప్యాకేజీ కోసమే చంద్రబాబుని కలిశారాన్నారు. ప్రజల పక్షానా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని, కందుకూరు సభలో 8 మంది చనిపోతే తరువాతి సభలో జాగ్రత్తలు పాటించడం తెలియదాని ప్రశించారు. పవన్, చంద్రబాబు ముసుగు తొలగించి ముందుకు వచ్చారన్నారు. వైసీపీ ఎప్పుడు ఒంటరి పోరాటం చేస్తుందన్నారు. మాకు భయం లేదని, మాకు జన బలం ఉందన్నారు. 2011-14 లో మీ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని, ఏమి చేశారు చెప్పాలని చర్చిచడానికి సిద్ధంగా ఉన్నాన్నని, దమ్ముంటే చంద్రబాబు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కుప్పంలో రిగ్గింగ్ చేసి గెలిచిన నువ్వు , నీకు బుద్ధి చెప్పెందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎజెండా లేని వ్యక్తులను తన పక్కకు తీసుకువచ్చి పని చేసుకోవాలని చూస్తున్న చంద్రబాబు 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను సీఎం అభ్యర్థిగా ప్రకటించగలరా అని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి- బలరామపురం రహదారి మధ్యలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ పైడిపాల గ్రామానికి చెందిన కొరుప్రోలు వీరబాబు ఎస్.పైడిపాల నుంచి ద్విచక్ర వాహనంపై ములగపూడి వెళ్తుండగా బలరాంపురం సమీపంలో రహదారిపై ప్రయాణిస్తున్న జిగిరెడ్డి నూకరావును ఢీకొట్టి రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో వీరబాబును తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యానాంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సిఎం రంగసామి

3వ రోజుకు గొల్లపల్లి నిరవధిక దీక్ష

ప్రజాశక్తి - యానాం

దీక్షలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

యానాం ప్రజల సమస్యలు పరిష్కరరించాలని పలు డిమాండ్ల సాధనకు గాను యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేపట్టిన నిరవధిక దీక్ష మూడవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. గొల్లపల్లికి మద్దతుగా అధిక సంఖ్యలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దీక్షలో పాల్గొన్నారు. రోజురోజుకు మద్దతు పెరుగుతూ అధికసంఖ్యలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు దీక్షా శిబిరానికి తరలివచ్చి గొల్లపల్లికి సంఘీభావం తెలిపారు. జిల్లాకు చెందిన ఆయా పార్టీల నాయకులు, ప్రముఖులు తదితరులు దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే గొల్లపల్లిని కలిసి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం తాను పేర్కొన్న సమస్యలను పరిష్కరించేవరకూ దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి యానాం సమస్యలు పరిష్కరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రంగస్వామి అంటే తనకు గౌరవం ఉందని, తన మాటలు వక్రీకరించారని ఆయన ఆందోళన చెందారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి రంగస్వామి పుదుచ్చేరి నుంచి ప్రజా ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు సాయంత్రం యానాం విచ్చేశారు. అయితే గొల్లపల్లి దీక్షా శిబిరం వద్దకు ముఖ్యమంత్రి వెళతారా లేదా అన్న ఉత్కంఠ అందరిలోని నెలకొంది. ఈ విషయం యానాంలో చర్చనీయాంశమైంది.

యానాం ఉత్సవాలకు సిఎం రంగసామి

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఆదివారం సాయంత్రం యానాం విచ్చేశారు. ఈ నెల 6వ తేదీన ప్రారం భమైన యానాం ప్రజా ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు యానాం విచ్చేశారు. ఆయనకు పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వాగతం పలికారు. యానాం పోలీసుల సిఎం రంగసామికి గౌరవ వందనం సమర్పించారు.

నేటి స్పందన కలెక్టరేట్‌లోనే ..

ప్రజాశక్తి కాకినాడ

2023 జనవరి 9 తేదీ సోమవారం నాటి స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకరణ కార్యక్రమం ఉదయం 9:30 నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం, కాకినాడ లోనే జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని ఆమె కోరారు.

'విలస'లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి

ప్రజాశక్తి-అయినవిల్లి

విలసలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రాని కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా రచ్చబండ కార్యక్రమం విలస గ్రామశాఖ అధ్యక్షులు అక్కిశెట్టి దుర్గారావు ఆధ్వర్యంలో ంండల టిడిపి అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ గంటి హరీష్ మాథూర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పి మాజీ చైర్మెన్, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ కో కన్వీనర్, నామన రాంబాబు తదితుర్లు పాల్గొన్నారు.

పాలనలో వైసిపి ప్రభుత్వం విఫలం

ఉప్పలగుప్తం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్ఎల్ఎ, కాకినాడ నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) అన్నారు. ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులపేటలో ఆదివారం అమలాపురం మాజీ ఎంఎల్ఎ, నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండబాబు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నాగిడి నాగేశ్వరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -మండపేట

మండపేట పట్టణంలోని బైపాస్ రోడ్డులో స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ సమీపంలో ఉన్న లేఔట్ లో గత ఏడాది డిసెంబర్ 31న తారీకున జరిగిన కుంజాల సురేష్ (26) హత్య కేసులో ఇద్దరు నిందితుతను అదుపులోనికి తీసుకున్నట్లు రూరల్ సీఐ శివ గణేష్ తెలిపారు. ఆదివారం ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. పట్టణానికి చెందిన సురేష్ స్టూడియోలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సురేష్ భార్య భవానిపై అనుమానం పడుతూ ఆమెను ప్రతిరోజు కొడుతూ ఉండేవాడు. దీంతో ఈ విషయాన్ని భవాని తన అత్తతో కలిసి స్థానిక ఆలమూరు రోడ్డులో ఉన్న బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్ కి వెళ్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, కోరా గోవిందు, బుంగా సంజయ్ లకు వెళ్లి చెప్పింది. ఈ నేపథ్యంలో చుండ్రు శ్రీ వర ప్రకాష్ రూ.2 లక్షలు సుఫారీ గోవిందుకు ఇచ్చి కుంజాల సురేష్‌ను చంపమని చెప్పారు. ఈ విషయాన్ని కోరా గోవిందు, సంజీవ్‌లు శెట్టి వీర వెంకటేశ్వరరావు (వీరబాబు)కు చెప్పారు. శెట్టి వెంకటేశ్వరరావు 31న రాత్రి సురేష్ కు మందు ఇస్తానని చెప్పి బైపాస్ రోడ్డుకు తీసుకువెళ్లి అతని స్నేహితులైన సాయి, మారి శ్రీను సహాయంతో సురేష్ కు విష పదార్థం కలిపిన మద్యం తాగించారు.తరువాత అతనిని తీసుకువెళ్లి హైవే రోడ్డులో వదిలి పెట్టాలని నిర్ణయి ంచు కున్నారు. మృతుడు సురేష్ బండి మీద ఎక్కించు కుని తీసుకు వెళుతుండగా మధ్యలో అతను కేకలు వేయడంతో మళ్లీ యధాస్థానానికి తీసుకొచ్చి అతని కొట్టి పీక మీద కాలుతో నొక్కి చంపారు. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తొలుత అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసినప్పటికీ బంధువులు, పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా హత్య కేసుగా మార్చి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఫోన్, తదితర సాక్ష్యాల ఆధారంగా శెట్టి వీర వెంకటేశ్వరరావు, గునుపల్లి నాగ సాయి కష్ణ ప్రసాద్ లను అదుపులోనికి తీసుకొని విచారించగా వారు నేరం అంగీకరించడంతో వీరిపై కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు వీరికి రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు. ఈ కేసులో మిగిలిన చుండ్రు వర ప్రకాష్, కోరా గోవిందు, బుంగా సంజయ్, మారి శ్రీను, వరప్రకాష్ అనుచరుడు నిందితులకు ఆశ్రయం కల్పించిన కపిలేశ్వరపురానికి చెందిన సత్తిబాబును అదుపులోనికి తీసుకోవాల్సి ఉందని సిఐ తెలిపారు.

100 రోజులు పూర్తి చేసుకున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-అమలాపురం

భోజనం అందజేస్తున్న హరీష్

మాజీ లోక్‌సభ స్పీకర్ జియంసి బాలయోగి జయంతి సందర్భంగా ఆయన కుమారుడు గంటి హరీష్ మాథూర్ ఆధ్వర్యంలో పట్టణంలో ముమ్మిడివరం గేటు వద్ద గత ఏడాది అక్టోబర్ 1న ప్రారంభించిన్న క్యాంటీన్ ఆదివారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక పూట రెండు వందలమందికి పైగా భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిల్లా జగదీశ్వరి, మెట్ల రమణబాబు, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, నల్లా స్వామి, బొర్రా చిట్టిబాబు, దెందుకూరి సత్తిబాబు, వాసంశెట్టి సత్య, ఆశెట్టి ఆదిబాబు, చెరుకూరి సాయిరాం, మందపాటి కిరణ్, భాస్కర్ల రామకష్ణ, పోతుల బోసు, పరమట శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రూ.1.38 లక్షల స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో వైయస్ఆర్ నగర్ నందు డాబాలో పేకాట శిబిరం పై రామచంద్రపురం పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ డి.సురేష్ బాబు సిబ్బంది తో దాడి నిర్వహించి పేకాట నిర్వహిస్తున్న కొయ్యాన జయరాజ్ , పిల్లి చిట్టిబాబు, యాదం చంటి, కోలా పాపారావు, కోలా రాంబాబు, నర్రు గురుమూర్తి లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 1,36,820 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు

ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు

కొత్తపేటలో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తపేట

సంక్రాంతిని పురస్కరించుకుని కొత్తపేట హైస్కూల్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ఆదివారం ప్రారంభించారు. సుమారు 11 రోజులు పాటు గ్రౌండ్లో ఎగ్జిబిషన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్లో జెయింట్‌వీల్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ వంటివి చిన్న పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పలు ఈవెంట్స్ ను మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, స్థానిక సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు,అవిడి సర్పంచ్ రెడ్డి చంటి,ముసునూరి వెంకటేశ్వరరావు,మండల వైసిపి అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, దంగేటి సుబ్రహ్మణ్యం, బొక్కా లోకేష్ తదితరులు ప్రారంభించారు. అనంతరం స్థానిక జెడ్పిటిసి సభ్యుడు గూడపాటి రమాదేవి, ప్రవీణ్ కుమార్ తన పిల్లలతో వచ్చి ఎగ్జిబిషన్ ను తిలకించారు. కార్యక్రమంలో బెజవాడ నారాయణరావు, విద్యాకమిటీ చైర్మన్ బీరా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి-కొత్తపేట

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హయాంలో ముస్లింల అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించిందని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ మీరాన్ షరీఫ్ ఆరోపించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కడపలోని హజ్ హౌస్ నిర్మించగా దానిని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిందని షరీఫ్ అన్నారు. హజ్ హౌస్ ను వెంటనే ముస్లింలకు వచ్చే రంజాన్ మాసం కల్లా అందుబాటులోకి తేవాలని లేకపోతే ఆందోళన చేస్తామన్నారు.

ప్రభుత్వ విధానాలతో కానరాని పండుగ

ప్రజాశక్తి - పెరవలి

ప్రజల్లో ఎక్కడా పండుగ వాతావరణం కనిపించట్లేదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి అన్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లడారు. రాష్ట్రం, దేశంలో ఆర్థిక పరిస్థితులు సరిగా లేవన్నారు. నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంద న్నారు. ఫలితంగానే నేడు ఎక్కడా పండుగ వాతావరణ కనిపించట్లేదన్నారు. ఏడా దికి ఒక్కసారి, చేసుకొనే పండుగ ఆర్థిక ప్రభావంతో వెలవెల వెలవెలబోతుందన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో దేశంలో పెను మార్పులు జరిగి కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందన్నారు.

జనసేన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ధవళేశ్వరం

వర్రే రమేష్ అధ్యక్షతన ఆదివారం జనసేన పార్టీ సంజయ్‌నగర్ ఆత్మీ య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెఎస్‌పి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ హాజరయ్యారు. పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు హాజరయ్యారు.

మహారాజశ్రీ పెద్దాపురం అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.P.No. 3/2022
O.S.No. 24/2020

బిట్వీన్:
వాది: పల్లా వెంకటరమణ

మరియు

ప్రతివాద్లు: తోట సాయినాధ్ వగైరా
టు:
1) తోట సాయినాధ్, తండ్రిం రామస్వామి, వయస్సు 27 సంగలు, డో.నెం. 21-1-116, లలితా ధియేటర్ వద్ద, రాజమండ్రి రోడ్.
2) తోట వెంకటనాధ్, తండ్రి: రామస్వామి, వయస్సు 25 సంగలు, డో.నెం. 21-1-116, లలితా ధియేటర్ వద్ద, రాజమండ్రి రోడ్.

ప్రకటన

పై నెంబరు దావాలో 1వ, 2వ ప్రతివాదులు అయిన మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపినా తీసుకోని కారణముచే **ది.01-02-2023 సంగరం తేదీని ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు ఏవిధమైన ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోగలరు.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించడమగునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

దొమ్మేటి విల్సన్‌రాయ్,
కర్రా ఎలీషారావు,
వాది తరుపు అడ్వకేట్స్, పెద్దాపురం.
సెల్: 99852 00523

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 45/2019

బిట్వీన్:
కర్రి వీరవెంకట సాయిరెడ్డి, తండ్రి: ఆదిరెడ్డి, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పు గోదావరి జిల్లా.

మరియు

1) పలివెల సత్యానందం, తండ్రిం వెంకొజి, డో.నెం. 2-244/1, పెంట్‌హౌస్, ఆంజనేయ నగర్, Opp. APSP QRS, కాకినాడ రూరల్, కాకినాడ జిల్లా, పిన్: 533005.
2) పలివెల లక్ష్మి, భర్త: పలివెల సత్యానందం, -do-

పై నెంబరు దావా గ్రంధమునకు గాను ప్రతివాద్లు హాజరు నిమిత్తం మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు /నోటీసులు పంపినానూ మీరు ఉద్దేశ్యం పూర్వకంగా సదరు కోర్టు సమన్లు /నోటీసులు త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.21-02-2023 ఉదయం 10:30 నిగలకు మీరు స్వయంగా గాని, లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేనిఎడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)

టి.వి.వి.రమణమూర్తి,
అడ్వకేట్, దుప్పలపూడి.
సెల్: 96527 36367

మహారాజశ్రీ అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 16/2019
O.S.No. 107/2018

బిట్వీన్:
బొక్కా నాగవెంకట సత్యశివప్రసాద్
...డి. హెచ్. ఆర్

మరియు

గుత్తుల సుబ్బలక్ష్మి, భర్త: రామకృష్ణ, 35 సంగలు, హిందూ, గృహిణి, డో.నెం. 5-160, పితాని వారి పాలెం, కామనగరువు.
...జె. డి. ఆర్

ఈ దిగువ షెడ్యూలు ఆస్థి వేలపు ప్రకటన

ఈ నెంబరు అమలు గ్రంధంలో పై జె.డి.ఆర్.యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని వేలము వేయుటకు శ్రీకోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు ప్రకారం **ది.30-01-2023 సంగరం తేదీన ఉదయం గంగ 10:30 నిగలకు పై కోర్టు వారి ఎదుట పై ఆస్థిని వేలంలో పాడుకొనదలచిన వారు హాజరు అయ్యి పాట వివరములు, షరతులు వగైరాలు నజారత్ ఆఫీసు నుండి పొంది వేలం పాటలో పాల్గొనవచ్చును.**

వేలం వేయు ఆస్థి వివరము

తూగగోగజిల్లా, అమలాపురం ఎస్.ఆర్.ఓ.లో చేరిన, ఉప్పలగుప్తం మండలం, విలసవిల్లి గ్రామ పంచాయితీ విలసవిల్లి గ్రామం తాలూకు జిరాయితీ పల్లం రి.స.నెం. 107/4లో పూరా య.1.07ట్లులో దక్షిణం వైపు మధ్య య.0.11ట్లు ఆకుమడి భూమికి హద్దులు:
తూర్పు: ఇరిగేషన్ బోది, గవర్నమెటు పుంత. ***దక్షిణం:*** ఈరోజున జి.శ్రీనివాసరావు గార్కి విక్రయించిన భూమి. ***పడమర:*** డి.లక్ష్మి ప్రియ వగైరాల భూమి. ***ఉత్తరం:*** కె.సత్యనారాయణ గార్కి ఈరోజున విక్రయించిన భూమి.

ఈ హద్దుల మధ్యస్తమయిన య.0-11ట్లు భూమి ఈజిమెంటరీ హక్కులు సర్వం సహా.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.2,75,000/-
అమీనా విలువ : రూ.2,75,000/-

అమలాపురం, 08-01-23.
జి.ఎస్.నాయుడు,
అడ్వకేట్, అమలాపురం.